ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.34 | సహర్: 4.53 (బుధవారం)
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
మంగళవారం 26 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0

రంగు పడింది

» ఆనందోత్సాహాలతో హోలీ » సంబరాల్లో మునిగితేలిన యువత


సూర్యాపేటలో హోలీ వేడుకల్లో పాల్గొన్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి


మోతెలో బోనాలు తీసుకువస్తున్న మహిళలు

హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. సోమవారం జిల్లా ప్రజలు హోలీ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటలకే అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు, యువకులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి హోలీ వేడుకలు నిర్వహించారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ కేరింతలు కొట్టారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వార్డుల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల నివాసాలకు నాయకులు, ఉద్యోగులు వెళ్లి రంగులు పులిమి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల్లో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో జాతరలు జరగ్గా, మహిళలు బోనాలు సమర్పించారు.

●7, 8లో..


పారిశుధ్య కార్మికులతో హోలీ సంబరాలు చేసుకుంటున్న పేట మునిసిపల్ చైర్మన్ అన్నపూర్ణ




పేటలోని ఓ హాస్టల్‌లో చిన్నారులకు మిఠాయి తినిపిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

మోదీ, కేసీఆరే తెలంగాణను
నాశనం చేశారు

» నిరంకుశ బీజేపీని ఓడించాలి » మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మట్టపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, మార్చి 25: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ప్రజలంతా సుభిక్షంగా ఉంటారనుకుంటే ప్రధాని మోదీ, కేసీఆర్ కలిసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మట్టపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు కోట్ల ఉద్యోగాలు ప్రకటించిన మోదీ, లక్ష ఉద్యోగాలు ఇస్తామన్న కేసీఆర్ నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, రాజకీయ ముసుగులో వీరు ఆడుతున్న నాటకం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. పదేళ్ల పాలనలో కుంభకోణాలు, దందాలకు పాల్పడిన బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ప్రజలు చరమగీతం పాడటం ఖాయమన్నారు.

కేసీఆర్ అవినీతికి గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పగా, మళ్లీ మోదీ అంటూ పరుగులు పెట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పోరాటం చేసిన వారిలో 730 మంది చనిపోయారని, మోదీ పాలనలో పార్లమెంటు వ్యవస్థ ధ్వంసమైందన్నారు. చివరి పార్లమెంట్ సమావేశాల్లో 146మంది ఎంపీలను సస్పెండ్ చేసిన చరిత్ర మోదీదన్నారు. తెలంగాణ ఏర్పాటు సందర్భంగా ఇచ్చిన హామీ ఖాజీపేట రైల్వేజోన్, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీల ఏర్పాటును తుంగలో తొక్కారన్నారు.

అన్ని ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటాం

రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలను గెలుచుకుంటామని ఉత్తమ్ అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఏడాదికి రూ.1లక్ష ఇస్తాననే హామీలన్నీ రాజకీయ లబ్ధికోసం కేంద్రం ఆడుతున్న నాటకమన్నారు. బీ ఆర్‌ఎస్ ప్రభుత్వంలో నష్టపోయిన పేద ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలో తెచ్చారన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికలోనూ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తూ కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తారన్నారు. నల్లగొండ పార్లమెంటు స్థానంలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3లక్షల మెజార్టీ వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఇంకా భారీ మెజార్టీతో ఎంపీ స్థానం గెలుస్తామన్నారు. నల్లగొండ పార్లమెంటులో పరిధిలో వీర సైనికులు ఉన్నారని, చెమటోడ్చి, రక్తం ధారపోసి దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ను బలంగా ఉంచారని, వారి త్యాగాలకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. వారికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

పార్లమెంటు సన్నాహక సమావేశం 30న

ఈనెల 28న నిర్వహించాల్సిన పార్లమెంటు నియోజకవర్గ సమావేశాన్ని ఈనెల 30కి వాయిదా వేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మట్టపల్లిలో సమావేశ ప్రాంగణాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సన్నాహక సమావేశ కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నాయకులు సాముల శివారెడ్డి, ఎరగాని నాగన్నగౌడ్, భూక్యా మంజూనాయక్, చావా కిరణ్మయి, ఎండీ.నిజాముద్దీన్, తన్నీరు మల్లిఖార్జున్‌రావు, డీవీఆర్, అప్పారావు, కిషోర్‌రెడ్డి, సక్రునాయక్, భీముడునాయక్, కరీం, సైదులు, గురవయ్య, ఎంఎం.యాదవ్, జహంగీర్, కొతి సంపత్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, వంగవీటి వేణుగోపాల్‌రావు, పి.నరసింహారావు, ఆలేటి రమేష్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా మట్టపల్లి లక్ష్మీనృసింహుడిని మంత్రి దర్శించుకున్నారు.

ప్రజలతో మమేకమైతేనే విజయం

» జిల్లా నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
» ఎండిన పంటలను పరిశీలించేందుకు త్వరలో రానున్న గులాబీ బాస్


కేసీఆర్‌కు బొకే అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 25: ప్రజలతో మమేకమైతేనే కచ్చితంగా విజయం సొంతం అవుతుందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. లోకసభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం రాత్రి హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కంచర్ల బ్రదర్స్ బీఆర్‌ఎస్ అధినేతకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన సీనియర్ నేతలను కలుపుకొని, ప్రణాళికాబద్ధంగా ఎన్నికల వ్యూహాన్ని రూపొందించుకోవాలని సూచించారు. మాజీ మంత్రి, ఉద్యమ నాయకుడు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తారని తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన నాయకులతో కలిసి పనిచేస్తూ వెళ్లాలని, తప్పక విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో నల్లగొండ జిల్లా ముషంపల్లి, భువనగిరి జిల్లాలో ఆలేరులో ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు తాను వస్తానని, దానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సిద్ధం చేయాలని సూచించారు.



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రధాన పార్టీలు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేశాయి. నల్లగొండ పార్లమెంటుకు అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా, భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. త్వరలోనే కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం వెలువరించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. అయితే అన్ని పార్టీలు సామాజిక కోణంలో ఆలోచిస్తూ ఆయా వర్గాల ఓట్లను పొందేందుకు లెక్కలు వేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

సామాజికంపై గురి

మెజార్టీ ఓటర్లపై నజర్

» ఓట్ల లెక్కల్లో మునిగిపోయిన అభ్యర్థులు
» గెలుపే లక్ష్యంగా నియోజకవర్గాల్లో అడ్డా
» పార్టీ నేతల్లో అసమ్మతి రాగం
» బుజ్జగించే పనిలో అధిష్ఠానం

పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ సామాజిక వర్గాలు అధికంగా ఉన్నాయి? ఎన్నికల్లో వారి ఓట్ల ప్రభావం ఎంత? వారు ఏ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది? తమకు అనుకూలంగా ఓటర్లను తిప్పుకోవడం ఎలా? అనే అంశాలపై పార్టీల అధిష్ఠానాలు విశ్లేషణల్లో నిమగ్నమయ్యాయి. అయితే పలు నియోజకవర్గాల్లో మెజార్టీ కులాలకు సంబంధించిన సంఘాల పెద్దలను కూడా అభ్యర్థులు ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆయా పార్టీల్లోని అగ్రనేతలతో నియోజకవర్గాల్లోని పరిస్థితిపై కులసంఘాల పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిసింది. సామాజిక న్యాయంలో భాగంగా నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ నుంచి కుందుర్తి రఘువీర్‌రెడ్డిని, బీఆర్‌ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డిని అభ్యర్థులుగా ఆయా పార్టీల అధిష్ఠానాలు ప్రకటించాయి. భువనగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ నుంచి బీసీ వర్గానికి చెందిన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నుంచి బీసీకి వర్గానికి చెందిన క్యామ మల్లేష్, సీపీఎం తరఫున మైనార్టీకి చెందిన ఎండీ.జహంగీర్‌ను ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా), జనగామ (జనగామ జిల్లా) నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో అధిక శాతం ఓటర్లు బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో బీసీలు అధిక శాతం ఉన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో పాటు పలు సంక్షేమ పథకాలపై ఫోకస్ పెట్టింది. బీఆర్‌ఎస్ మాత్రం గతంలో బీసీ, ఎస్సీలకు ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేయనుంది. బీజేపీ అధిష్ఠానం చట్టసభల్లో బీసీలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రచారం చేస్తోంది. అన్ని పార్టీలు మెజార్టీ ఓటర్లపై దృష్టి కేంద్రీకరించి, ఎన్నికల కదన రంగంలో దూసుకుపోతున్నాయి.


లెక్కల్లో మునిగిన అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఓట్ల లెక్కల్లో మునిగిపోయారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో 3,37,389 మంది ఓటర్లు, మునుగోడులో 2,56,269మంది, భువనగిరిలో 2,19,688మంది, నకిరేకల్‌లో 2,52,906మంది, తుంగతుర్తిలో 2,58,447మంది, ఆలేరులో 2,34,262మంది, జనగామలో 2,41,437మంది ఓటర్లు ఉన్నారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,47,722మంది ఓటర్లు, దేవరకొండలో 2,61,858మంది, నాగార్జునసాగర్‌లో 2,35,795మంది, మిర్యాలగూడలో 2,35,334మంది, హుజూర్‌నగర్‌లో 2,50,099మంది, కోదాడలో 2,45,201మంది, సూర్యాపేటలో 2,42,945మంది ఓటర్లు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా మెజార్టీ ఓటర్లు గౌడలు, ముదిరాజ్‌లు, పద్మశాలీలు, గొల్ల, కుర్మలు, ఎస్సీలు ఉన్నారు. దేవరకొండలో ఎస్టీలు, తుంగతుర్తి, నకిరేకల్‌లో ఎస్సీ ఓటర్లు అధిక శాతం మంది ఉన్నారు. ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు గతంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసిన అనుభవం ఉన్నవారే ఉన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కులాల వారీగా ఓటర్ల గణనను సిద్ధం చేసుకున్నారు. ఏ సామాజికవర్గాల నుంచి ఎంత మేరకు ఓటింగ్‌కు పొందవచ్చన్న లెక్కల్లో వారు నిమగ్నమయ్యారు. నియోజకవర్గాల్లో గతంలో పోటీ చేసిన అనుభవం ఉన్న సీనియర్ నేతలు ఎంపీ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించే అవకాశం ఉన్నందున, వారి సేవలను వినియోగించుకునేందుకు ప్రధాన పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతోనూ తాజా రాజకీయ పరిస్థితులపై సంప్రదింపులు చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం తీసుకోవాల్సిన వ్యూహాలతో పాటు సామాజికవర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌దే పైచేయి

నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెజార్టీ ఎమ్మెల్యేలు అధికార పార్టీ కాంగ్రెస్ చెందిన వారే ఉన్నారు. ఇబ్రహీంపట్నం, తుంగతుర్తి, నకిరేకల్, భువనగిరి, ఆలేరు, మునుగోడులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉండగా, జనగామలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, సూర్యాపేటలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో తమ పార్టీ అభ్యర్థుల గెలుపు సునాయసమని కాంగ్రెస్ విశ్వాసంతో ఉంది. నల్లగొండ నుంచి మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఎంపీ స్థానం సీటు కేటాయింపుపై పార్టీల్లో ఎలాంటి అసంతృప్తి బయటపడలేదు. భువనగిరి స్థానం కేటాయింపు విషయంలో పార్టీలోని అగ్రనేతలు తమకు చెందిన అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దీంతో అభ్యర్థి ప్రకటనలో జాప్యం జరుగుతోంది. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించగా, వారు ప్రచారంలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ మాత్రం అభ్యర్థి ఎంపికపై తర్జనభర్జన పడుతోంది.

అసమ్మతి రాగం



లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగానే పలు పార్టీల్లోని నేతల్లో అసమ్మతి రాగం ఊపందుకుంది. భువనగిరి స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, జిట్టా బాలకృష్ణారెడ్డి పేర్లను అధిష్ఠానం పరిశీలించింది. అయితే అనూహ్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన క్యామ మల్లేష్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఎంపీ టికెట్‌పై ఆశలు పెంచుకున్న నేతలు పార్టీ పెద్దల వద్ద అసమ్మతి రాగం వినిపించినట్లు తెలిసింది. సికింద్రాబాద్ స్థానం గౌడలకు కేటాయించినందున, భువనగిరి కురుమలకు, నల్లగొండ నుంచి రెడ్డి సామాజికవర్గాలకు అవకాశం కల్పించినట్లు పార్టీ అధిష్ఠానం సదరు నేతలకు వివరించినట్లు సమాచారం. ఇక నల్లగొండ స్థానాన్ని కంచర్ల కృష్ణారెడ్డికి కేటాయించడంతో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలు త్వరలో భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీజేపీలో భువనగిరి స్థానంలో గతంలో పోటీ చేసిన పీవీ.శ్యాంసుందర్‌రావు మరోసారి రంగంలో ఉండేందుకు సిద్ధమయ్యారు. కాగా, బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో పీవీ.శ్యాంసుందర్‌రావు పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. నియోజకవర్గంలోనూ ఆయన ఎక్కడా పర్యటించడంలేదు. నల్లగొండ పార్లమెంట్ స్థానం విషయంలోనూ పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన శానంపూడి సైదిరెడ్డికి అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో పలువురు నేతలు అధిష్ఠానం వద్ద అసమ్మతి రాగం విన్పించినప్పటికీ, వారిని సర్దిచెప్పే పనిలో పార్టీ అగ్రనేతలు నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీల్లోని అసమ్మతి నేతలు లోకసభ ఎన్నికల్లో ఎంతమేరకు కలిసొస్తారన్నది వేచిచూడాల్సిందే.

ధర్మాపురంలో కొనసాగుతున్న వైద్య శిబిరం


పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెన్‌పహాడ్, మార్చి 25: మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో సోమవారం రెండో రోజు కూడా వైద్య శిబిరం కొనసాగింది. గ్రామంలో ఐదుగురు డెంగీ బారిన పడి మంచం పట్టిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా, ఆదివారం గ్రామాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం సందర్శించారు. వైద్య సిబ్బందితో ఆరోగ్య పరీక్షలు చేయించి బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈ నెల 27వ వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆయన ప్రటించారు. ఈ మేరకు గ్రామంలో హెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ సైదులు, ఎల్‌హెచ్‌పీ జాన్‌సీలా ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగింది. వీరు ఇంటింటికీ తిరిగి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించారు. గ్రామస్థులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో మురుగు కాల్వలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల నివారణ మందు చల్లించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సరిత, ఆశ వర్కర్లు సుమలత, విజయ, త్రివేణి, రమణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఈ శిబిరానికి హాజరుకాకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, హోలీ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో రాలేదని ఆమె సమాధానమిచ్చారు.

పాతుకుపోయారు!

» దీర్ఘకాలికంగా ఉద్యోగుల తిష్ట » స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన జరిగేనా?

●7లో..

గుట్టలో హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, మార్చి 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ లక్ష్మీనరసింహస్వామికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవగామ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన ఆచార్యులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను ముగ్ధమనోహరంగా అలంకరించిన ఆచార్యులు విశ్వక్సేనుడికి తొలి పూజలు జరిపి సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ. 43,15,101 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం జరిగిన హోలీ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో హోలీ ఉత్సవం వైభవంగా పూజారులు చేపట్టారు.


కొండపై హోలీ ఉత్సవ పూజల్లో పాల్గొన్న అర్చకులు, అధికారులు

సూర్యాపేట జిల్లాలో రూ.2.99 లక్షల నగదు స్వాధీనం

సూర్యాపేటఅర్బన్ / కోదాడ రూరల్, మార్చి 25: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో సోమవారం పోలీసుల తనిఖీల్లో వేర్వేరు చోట్ల రూ.2.99 లక్షల నగదు పట్టుబడింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.69,700 నగదును సీఐ రాజశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద హైదరాబాద్ వెళ్తున్న కారును తనిఖీచేసి రూ.69,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా కోదాడ మండలంలోని రాష్ట్ర సరిహద్దులోని రామాపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. అదేవిధంగా అనంతగిరి మండలం శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి కోదాడకు డీసీఎం వాహనంలో తరలిస్తున్న రూ.4 లక్షల విలువైన చీరెలు, దుస్తులు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

కల్యాణం.. కమనీయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం పలు ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కొన్నిచోట్ల పౌర్ణమి తిథిని పురస్కరించుకుని కల్యాణ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలుచోట్ల స్వామి, అమ్మవార్లకు బోనాలను మొక్కులు చెల్లించుకున్నారు. అటు హోలీ పర్వదినంతో పాటు కల్యాణోత్సవాలతో ఉమ్మడి జిల్లాలో సందడి నెలకొంది.


వేములపల్లి మండలం ఆమనగల్లులో రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ ఘట్టం

నల్లగొండ జిల్లాలో

కనగల్, మార్చి 25 : వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కనగల్ గ్రామ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అక్కినేపల్లి తిరుమల్‌నాథ్ దంపతులు, అక్కినేపల్లి శ్రీనివాస్‌రావ్ దంపతులు, అక్కినేపల్లి శ్రీనివాస్‌చక్రవర్తిలు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలను, తలంబ్రాలను అందజేశారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి ఒడి బియ్యం సమర్పించారు. అంతకుముందు ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ చిట్ల వెంకన్న, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్, చిట్ల లింగయ్యగౌడ్, నాయకులు నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, మురళీగౌడ్, నక్కల రమేష్, నీలకంఠం శేఖర్, బెజవాడశ్రీహరి, జలందర్, పందిరిశ్రీధర్, ఓరుగంటి ఈశ్వరయ్య, నీలకంఠం యాదగిరి, మన్మధ, రాయల శ్రవణ్, మారగోని భవానీ, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాస కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతీ నెలా పౌర్ణమి తిథిని పురస్కరించుకుని కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సతీశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మల అర్చకత్వంలో ఈ తంతు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అదేవిధంగా గోపలాయపల్లి క్షేత్రంలోనూ మాసకల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.


చెర్వుగట్టులో మాసకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శాలిగౌరారం: మండలకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం రాజగోపుర శాంతికల్యాణం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన యాగం, హోమం, కుంభాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజగోపురం దాతలు చామల వాణి -వీరేష్‌రెడ్డి, చామల సృజన - రాంరెడ్డి, ఆలయ ధర్మకర్తలు శేషం నర్సింహాచార్యులు, రత్నమాచార్యులు, జగన్ మోహనచార్యులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: ఆమనగల్లు గ్రామ శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నారాయణం సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు అశోకుమారి దంపతులు, ధర్మకర్తలు లొండ కలమ్మ, పెరుమాళ్ల జోజి, కొండ వెంకన్న, భిక్షం, ముత్యాల యుగంధర్, పిల్లల సందీప్, ఎస్ఐ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీ ప్రవీణ్ పాల్గొన్నారు.

మర్రిగూడ: శివన్నగూడ, చర్లగూడ పరిధిలోని నీలకంఠ రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో దేవాదాయ ఆలయ చైర్మన్ రాపోలు యాదగిరి, వైస్‌చైర్మన్ చిట్యాల రంగారెడ్డి, ఎంపీటీసీ ఎన్నమనేని రవీందర్‌రావు, కమిటీ సభ్యులు యాదయ్య, మాదగోని శ్రీను, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాందాసు శ్రీనివాస్, వెంకటంపేట బాలయ్య, అజిత్ రెడ్డి, రావుల రాములు, నక్క యాదగిరి, భాస్కర్ ఉన్నారు.


మేళ్లచెర్వు మండల కేంద్రంలో బోనాలతో మహిళల ఊరేగింపు

సూర్యాపేట జిల్లాలో

మేళ్లచెర్వు: మేళ్లచెర్వులోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి, అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన కల్యాణ మహోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీటీసీ రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కందుల సురేష్, గోవిందరెడ్డి, బుడ్డి చిన్న, జనార్ధన్‌రావు, వెంకటేశ్వరరావు, వెంకటస్వామి పాల్గొన్నారు. అదేవిధంగా వేపలమాదారం గ్రామంలో తిరుపతమ్మ, గోపయ్యల కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు.


దాచారంలో తిరుపతమ్మ, గోపయ్య అమ్మవార్లు

మోతె: మండలకేంద్రంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కల్యాణోత్సవాల సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవతలకు స్వామివార్లకు జలబిందెలు, బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ, యువకులు ప్రభబండ్ల ఊరేగింపు, క్రీడలతో అలరించారు.

నేరేడుచర్ల : మండలంలోని దాచారం గ్రామంలో శ్రీ గోపయ్య, సమేత తిరుపతమ్మ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పూజారులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ఈతంతు జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు.

నాగారం : ఫణిగిరి గ్రామం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన అర్చకులు మాధవచార్యులు,సంతోష్, ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెసు నాయకులు పానుగంటి నర్సింహరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రాంరెడ్డి, నాతి వీరమల్లు, వల్లాల భాను ప్రకాష్ పాల్గొన్నారు.


రామలింగేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న జంటలు, భక్తులు

యాదాద్రిభువనగిరి జిల్లాలో

మోత్కూరు: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అంతకుముందు ఆదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పన్రెపాటి యుగంధర్, పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, సోమ లింగయ్య, బుస్సా శ్రీనివాస్, కారుపోతుల వెంకన్న, బద్దం రామనర్సింహారెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్ లెంకల సుజాత, బయ్యాని రాజు, బీసు యాదగిరి, లోడె యాదగిరి, పట్వారి అంజయ్య, ఎడ్ల శ్రీనివాస్, కొప్పుల కరుణాకర్‌రెడ్డి, పూజారులు పీ వెంకటరమణశర్మ, పీ హరిబాబుశర్మ, పీ లక్ష్మణమూర్తి, రాజలింగం పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. స్వామి వారి కల్యాణోత్సవానికి మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం-లత, దేవాలయం చైర్మన్ అంకం వినోద్‌కుమార్-సౌమ్య, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్-శోభారాణి, కల్యాణకర్తలకు లడ్డూ ప్రసాదాన్ని పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, భావనాఋషి హౌజింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సీత అంజనేయులు-శోభారాణి, దేవాలయం మాజీ చైర్మన్లు గుణిగంటి మల్లేష్‌గౌడ్, కొయ్యడ నర్సింహగౌడ్, అంకం యాదగిరి, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, మాజీ ఎంపీపీ సార సరస్వతీబాలయ్యగౌడ్, ధర్మకర్తలు పాల్గొన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలు, తలంబ్రాలు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి - కిరణ్‌జ్యోతి తరుపున బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్ అందజేశారు.

ఎర్రబెల్లి జాతరకు పోటెత్తిన భక్తజనం

నిడమనూరు: మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో లింగమంతులస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాలో రెండో పెద్దగట్టుగా ప్రసిద్ధి చెందిన ఈ జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. జాతరలో భాగంగా తెల్లవారుజామున కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనేక మంది భక్తులు ఆదివారం రాత్రి నుంచే గట్టు వద్దకు చేరుకొని పెద్దసంఖ్యలో జీవాలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వాహనాల రద్దీతో పరిసరాల్లో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడగా ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ గోపాల్‌రావు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు

నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి కొండేటి మల్లయ్య, జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, అంకతి వెంకటరమణ, వల్లభ్‌రెడ్డి, కృష్ణవివేక్, చైర్మన్ మసిముక్కు మట్టయ్యలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కుందూరు సోదరులు జైవీర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డిలతో పాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ కత్తులతో విన్యాసాలు చేస్తూ డోలు వాయించారు. అదేవిధంగా ముప్పారం గ్రామంలో పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయబ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు జరిగిన ఎదుర్కోళ్ల కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఈవో నవీన్, జడ్పీటీసీ రామేశ్వరిమట్టారెడ్డి, వెంకట్‌రాహుల్, వల్లభ్‌రెడ్డి, వెంకటరమణ, గణపురం సత్యనారాయణ, మర్రి శ్రీను,మైసయ్య, కృష్ణ, సైదులు, శ్రీను, వీరేశం, పున్నయ్య, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.



డోలు, కత్తి విన్యాసాల్లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

హుజూర్‌నగర్, మార్చి 25 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన చింతకాయల వెంకన్న(55) సోమవారం మధ్యాహ్నం ఇందిరా చౌరస్తా నుంచి సుందరయ్యనగర్ కాలనీకి నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్గమధ్యలో పొట్టి శ్రీరాములు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన టీఎస్-29ఎం 0681 నెంబర్ గల క్రేన్ డ్రైవర్ చేకూరి రాజేష్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెంకన్నను ఢీకొట్టాడు. దీంతో వెంకన్న కడుపులో బలమైన గాయాలై తీవ్రంగా రోదించాడు. అతడిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడని తెలిపారు. కాగా వెంకన్నకు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకన్న బావమరిది ముల్కలపల్లి రామ్‌గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడి..

గుండాల, మార్చి 25 : బహిర్భూమికి వెళ్లిన యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మాసాన్‌పల్లిలో గ్రామానికి చెందిన పసునూరి మహేష్(30) సోమవారం సాయంత్రం బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లాడు. మహేష్‌కు మూర్ఛవ్యాధి ఉండడంతో చెరువులో పడి మృతి చెందాడు. కుమారుడు ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో తండ్రి సోమయ్య వెతుక్కుంటూ వెళ్లగా అప్పటికే చెరువులో మృతి చెంది కనిపించాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు రోదించారు.

నీటి సంపులోపడి బాలుడి..

తిప్పర్తి, మార్చి 25 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లి గ్రామంలో నీటిసంపులో పడి బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన యాదయ్య, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా వ్యవసాయం వృత్తి చేసుకునే వారు అదే గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోయడానికి వెళ్లారు. అనంతరం ఇద్దరు కుమార్తెలు ఆడుకోవడానికి బయటికి వెళ్లగా కుమారుడు శివ(7) ఇంట్లో అన్నం తిన్న తర్వాత చేతులు కడుక్కోవడానికి ఇంటి ముందు ఉన్న సంపు వద్దకు వెళ్లి జారి సంపులో పడిపోయాడు. ఆ తర్వాత శివ అక్కలు వచ్చి ఇంట్లో చూడగా శివ కనిపించలేదు. ఆచూకీ కోసం చుట్టుపక్కలా వెతికినప్పటికీ కనిపించలేదు. సాయంత్రం పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు వెతకగా నీటిసంపులో శవమై కనిపించాడు. ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తల్లిదండ్రుల రోదించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

పొలంలో నవజాత శిశువు మృతదేహం

చండూరు రూరల్, మార్చి 25: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో పొలంలో నవజాత శిశువు మృతదేహం లభించింది. గ్రామానికి చెందిన రైతు సుంకరి యాదయ్య సోమవారం ఉదయం 10గంటల సమయంలో పొలానికి వెళ్లాడు. అక్కడ నవజాత శిశువును(బాబు) గమనించి స్థానికులతో పాటు గ్రామ పెద్దలకు తెలిపాడు. వారు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పంచాయతీ కార్యదర్శి కోటయ్య సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శిశువు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల దూరంలో చండూరు పీహెచ్‌సీ, పలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. పొలానికి వెళ్లే దారిలో సీసీ కెమెరాలు లేకపోవడం, నిర్మానుష్య ప్రదేశంలో ఎవరు పడవేశారన్న అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

వరిపైరుకు నిప్పుపెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 25 : భూ వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని వరిపైరుకు నిప్పు పెట్టిన వ్యక్తిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని నందిపాడు గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 2009లో నందిపాడు గ్రామరెవెన్యూ శివారులోని 349 సర్వేనెంబర్‌లోని 2.07 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి వరిసాగు చేసుకుంటున్నట్లు బాధిత రైతు అశోక్‌రెడ్డి తెలిపారు. ఇదే భూమిని 2001లో బరపటి ముత్యాలు అనే రైతు నుంచి నందిపాడు గ్రామానికి చెందిన జానయ్య కొనుగోలు చేయగా, 2009లో జానయ్య నుంచి తాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. తన తండ్రి విక్రయించిన భూమిలో హెచ్చుతగ్గులున్నాయని ఆరోపిస్తూ ముత్యాలు కుమారుడు మల్లయ్య సోవారం తెల్లవారుజామున కోతదశలో ఉన్న వరిపైరుపై గడ్డివేసి నిప్పంటించగా పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంఘటనపై అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

పాతుకుపోయారు!



- రూ.వందల కోట్ల ఆదాయం ఇస్తున్న రిజిస్ట్రేషన్ శాఖపై ప్రభుత్వం దృష్టి
- ఉద్యోగుల బదిలీలపై తర్జనభర్జన
- ఇప్పుడా.. ఎన్నికలయ్యాకా..
- పోస్టింగ్‌ల కోసం పైరవీల జోరు

నల్లగొండ, మార్చి 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో దీర్ఘకాలికంగా ఉద్యోగులు, అధికారులు తిష్ఠ వేయడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల ఆదాయం సమకూరుస్తున్న కీలకమైన ఈ శాఖపై రాష్ట్ర ప్రభుత్వం సైతం దృష్టి సారించింది. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.375 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏళ్లకొద్దీ ఉద్యోగులు, అధికారులు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నప్పటికీనీ వారిని కదిలించడం లేదు. వారు ఆడిదే ఆట పాడిందే పాటగా మారింది. ఓ వైపు బదిలీలు లేకపోవడం మరోవైపు పదోన్నతులు కూడా కల్పించక పోవడంతో సంబంధిత శాఖలో ఎక్కడా వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. మూడు జిల్లాలో మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఆదాయం తక్కువ వస్తుండగా మిగిలిన అన్ని కార్యాలయాల్లో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది.

ఇన్‌చార్జి ఎస్ఆర్‌లతో అనేక సమస్యలు

పూర్తిస్థాయిలో సబ్‌రిజిస్ట్రార్‌లు లేకపోవడంతో ఉన్నతాధికారులు పలుమార్లు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను సబ్‌రిజిస్ట్రార్‌గా వేస్తున్నారు. దీంతో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరు కావాలనే, మరికొందరు అవగాహన లేకనో పలు వివాదస్పదమైన డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో ఉండే డాక్యుమెంట్ల రైటర్లు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌లు ఉన్నప్పుడు వారిని ఉపయోగించుకుని సంతకాలు చేయించుకుంటున్నారు. దీర్ఘకాలికంగా తిష్ఠ వేసిన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు కర్రపెత్తనం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి అయితే జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌లుగా వేయకూడదు.

బదిలీలపై ఎలాంటి సమాచారం లేదు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగులు, అధికారుల బదిలీలపై ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నిర్ణయాలకు అనుగుణంగా ముందుముందు బదిలీలు జరిగితే జరగవచ్చు. ఇప్పటివరకు అయితే ప్రభుత్వం నుంచి కాని, రాష్ట్రస్థాయి అధికారుల నుంచి కాని బదిలీల గురించి ఎలాంటి నిర్ణయం జరగలేదు.

\- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ

కానీ ఉద్యోగుల కొరత కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో వారిని ఇన్‌చార్జిలుగా వేసే పరిస్థితి నెలకొంది. ఏళ్లకొద్దీ ఇదే పరిస్థితి ఉంటుడటంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ పాలన గాడి తప్పుతుందన్న చర్చ సాగుతుంది. సబ్ రిజిస్ట్రార్‌ల కొరతను సాకుగా చేసుకుని జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌లుగా బాధ్యతలు ఇవ్వడంతో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయన్న వాదన వినిపిస్తుంది.

పోస్టింగ్‌ల కోసం జోరుగా పైరవీలు



రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయడంలో భాగంగా బదిలీలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు సైతం పోస్టింగ్‌ల కోసం పైరవీలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చాలామంది సబ్‌రిజిస్ట్రార్‌లు హైదరాబాద్ చుట్టుప్రక్కల ప్రాంతంలో కీలకమైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు కావాల్సిన ప్రాంతంలో పోస్టింగ్ కోసం నిరంతరంగా తిరుగుతూ ఆ పోస్టును సాధించుకోవడం కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సంబంధిత శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో కొన్ని కేడర్లలో ఇష్టానుసారంగా డిప్యూటేషన్లు, ఇన్‌చార్జి పోస్టింగ్‌లు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వం బదిలీలు చేయకుండా డిప్యూటేషన్లు, ఇన్‌చార్జి పోస్టింగ్‌లు ఇచ్చి అవినీతి అక్రమాలకు చోటు ఇచ్చిందన్నా విమర్శల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. అయితే పైరవీకారులను అడ్డుకుని అర్హత ఉన్న వారికే పోస్టింగ్‌లు ఇస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే.

ప్రక్షాళన వైపు అడుగులు పడేనా?

సంవత్సరాల కొద్ది ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులకు స్థానచలనం కల్పించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందా లేదా అనేది చూడాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఉన్నతాధికారితో పాటు సబ్‌రిజిస్ట్రార్‌లు, సీనియర్ అసిస్టెంట్లను పూర్తిస్థాయిలో బదిలీ చేయాలంటే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్‌కు సంబంధం లేకుండా బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయా లేదా ఎన్నికల అడ్డు ఉంటుందా అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతుంది. రిజిస్ట్రేషన్ శాఖ ఎన్నికల విధులతో సంబంధం లేకుండా ఉన్న శాఖ కావడంతో పెద్దగా అభ్యంతరాలు ఉండబోవని తెలుస్తోంది. వాస్తవానికి అయితే మూడు ఏళ్లకు పైగా ఒకే ప్రాంతంలో పనిచేసిన వారిని బదిలీ చేయడానికి నిబంధన ఉంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బదిలీలపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం సమస్యలు వచ్చి పడుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖలో దాదాపు 11 ఏళ్లుగా సాధారణ బదిలీలు లేకుండాపోయాయి. కొందరు అధికారులు, ఉద్యోగులైతే ఏళ్ల తరబడి ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్‌ల సాధారణ బదిలీలు జరిగాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బదిలీలు జరగకపోయినప్పటికిని డిప్యూటేషన్లు, ఇన్‌చార్జి పోస్టులతో సమస్యలను రెట్టింపు చేశారు. 2010 సంవత్సరం నుంచి కిందిస్థాయి ఉద్యోగుల బదిలీలు అసలు జరగలేదు. రిజిస్ట్రేషన్ శాఖలపై బదిలీలు నాలుగు, ఐదు సార్లు ప్రతిపాదనలు చేసినప్పటికిని అమలుకు నోచుకోలేదు.

వెల్లివిరిసిన మానవత్వం

భువనగిరి రూరల్, మార్చి 25: ఆశ్రమంలో మృతి చెందిన వృద్ధురాలికి హిందూ సంప్రదాయం మేరకు ముస్లిం దంపతులు అంత్యక్రియలు పూర్తి చేశారు. వారి సహృదయాన్ని అందరూ అభినందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. యాకూబీ, చోటు దంపతులు యాదాద్రిభువనగిరి జిల్లా రాయిగిరి సమీపంలో 15 సంవత్సరాలుగా సహృదయ అనాథ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 19న జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గంగాప్రసాద్ స్నేహితుడు నరేష్‌తో కలిసి తన అక్క చంద్రకళ(72)ను అనాథ ఆశ్రమంలో చేర్పించాడు. చంద్రకళ భర్త చాలా ఏళ్ల కిందటే మృతి చెందగా సంతానం లేకపోవడంతో తమ్ముడు ప్రసాద్ వద్దే ఉంటోంది. అనారోగ్యంతో ఉన్న చంద్రకళ బాగోగులను ఆశ్రమ నిర్వాహకులు యాకూబీ, చోటు చూస్తున్నారు. చంద్రకళ ఈ నెల 23వ తేదీన మృతి చెందింది. ఈ విషయాన్ని చంద్రకళ సోదరుడు గంగాప్రసాద్‌కు సమాచారం ఇవ్వగా ఆయన అంత్యక్రియలు నిర్వహించిందుకు నిరాకరించాడు. అంతేకాకుండా మీరే నిర్వహించుకోవాలని సమాధానం ఇచ్చి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అయితే ఆశ్రమ నిర్వాహకులు యాకూబీ, చోటు రెండు రోజులు వేచి చూసి సోమవారం హిందూ సంప్రదాయం ప్రకారం రాయిగిరి శివారులోని శ్మశాన వాటికలో చంద్రకళ అంత్యక్రియలు పూర్తి చేశారు. యాకూబీనే చితి చుట్టూ కుండతో తిరిగారు. ఆమె చేతితో దహన సంస్కారాలు చేశారు. ఇప్పటివరకు యాకూబీ, చోటులు కలిసి వరంగల్, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో దాదాపు 200మంది అనాథలకు దహనసంస్కారాలు నిర్వహించారు. అయితే ముస్లిం మహిళ అయినప్పటికీ హిందూ సంప్రదాయం ప్రకారం దహనసంస్కారాలు చేయడంపై పలువురు ఆమెను అభినందించారు.


చంద్రకళకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న యాకూబీ, చోటు

సాగర్‌ను సందర్శించిన వియత్నాం మీడియా బృందం

నాగార్జునసాగర్, మార్చి 25 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వియత్నాం దేశ మీడియా ప్రతినిధులు సందర్శించారు. వియత్నాం, భారత్ దేశాల సాంకేతిక, ఆర్థిక సహకారంలో భాగంగా హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న జర్నలిజం పబ్లిక్ రిలేషన్స్ అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మీడియా ప్రతినిధులు ప్రాజెక్టు ప్రధాన డ్యాం, నాగార్జునకొండ మ్యూజియంను తిలకించారు. మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీటీ శరత్‌చంద్ర, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వీకర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నోడల్ అధికారులు శ్రీనివాస్, సురేశ్‌కుమార్, శరత్, పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.


నాగార్జునకొండ మ్యూజియంలో వియత్నాం మీడియా ప్రతినిధులు

హోలీ.. ఆనంద కేళి

హోలీ పండుగను జిల్లాలో సోమవారం ఆనందోత్సవాలతో ప్రజలు నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా పరస్పరం రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావు, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావులకు అధికారులు రంగులు పూసి హోలీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోలీ పండుగ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. సహజ రంగులతో హోలీ పండుగను నిర్వహించుకోవాలని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


అర్వపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు


మోతె మండలంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు


హుజూర్‌నగర్‌లో హోలీ సంబురాల్లో యువకులు, చిన్నారులు


తుంగతుర్తిలో హోలీ సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు, యువకులు


మఠంపల్లిలో..


మద్దిరాలలో..


సూర్యాపేటలో..


నేరేడుచర్లలో హోలీ సంబురాల్లో పాల్గొన్న స్థానికులు

సూర్యాపేటలో హోలీ వేడుకల్లో పాల్గొన్న గ్రీన్ కమిటీ సభ్యులు




కోదాడలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


హుజూర్‌నగర్ మండలంలో హోలీ సంబురాల్లో చిన్నారులు, యువకులు


సూర్యాపేటలో హోలీ సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు


సూర్యాపేటలో హోలీ సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్


మేళ్లచెర్వులో హోలీ వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

పంచాగం ఆవిష్కరణ

కోదాడ, మార్చి 25: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో వైదిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీక్రోధి నామ సంవత్సర పంచాగాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రమూర్తి, శంకరమూర్తి, సామినేని రమేష్, ముత్తవరపు పాండురంగారావు, పైడిమర్రి సత్తిబాబు, బొలిశెట్టి కృష్ణయ్య, ఎస్ఆర్‌కే మూర్తి, అచ్చుత రామశర్మ, విష్ణుబొట్ల హరిప్రసాదశర్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడి మృతి

మద్దిరాల, మార్చి 25: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగవెల్లి వెంకటనర్సింహారావు(76) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ రజాక్ నివాళులర్పించి మాట్లాడుతూ వెంకటనర్సింహారావు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. వెంకటనర్సింహారావుకు భార్య, కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో జడ్పీటీసీ కన్న సురాంబవీరన్న, బెజ్జంకి శ్రీరాం రెడ్డి, సూరినేని నర్సింహారావు, వెంకన్న ఉన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కోదాడ రూరల్, మార్చి 25: ఏరియా ఫీడర్లలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున పలు గ్రామాల్లో విద్యుత్‌ను మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెమలిపురి గ్రామం, దోరకుంట ఏజీఎల్, గోండ్రియాల, తమ్మర అగ్రికల్చర్, గణపవరం ఏజీఎల్, కూచిపూడి ఏజీఎల్, కేటీఎల్ ఇండస్ట్రియల్ ఫీడర్లలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు రక్షణ కవచంగా

షీటీమ్స్

- ఏడాది కాలంలో 138అవగాహన సదస్సులు
- 160మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్, 16 మందిపై కేసు

మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీటీమ్స్‌తో సత్ఫలితాలు వస్తున్నాయి. జిల్లాలో షీటీమ్స్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. ఆకతాయిలకు పట్టుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. మారని పక్షంలో కేసులు నమోదు చేస్తున్నాయి. సూర్యాపేట షీటీమ్స్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు 2020-21 సంవత్సరానికి రాష్ట్రంలోనే ఉత్తమ అవార్డు దక్కింది.

- సూర్యాపేట టౌన్

విద్యాసంస్థల ప్రాంతాల్లో, బస్‌స్టేషన్లలో ఆకతాయిలు తిష్టవేసి విద్యార్థినులను, మహిళలను వేధిస్తున్నారు. ఇలాంటి వారిపై షీటీమ్స్ నిరంతరం నిఘా పెట్టి ఆధారాలతో అదుపులోకి తీసుకుంటున్నాయి. ఫిర్యాదు వచ్చినప్పుడు షీటీమ్స్ సభ్యులు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నారు. మరోసారి ఇలాంటి వేధింపులు పునరావృతం అయితే కేసులు నమోదు చేస్తున్నారు.

సూర్యాపేట, కోదాడ కేంద్రాలుగా షీటీమ్స్..


జిల్లాలో సూర్యాపేట, కోదాడ కేంద్రాలుగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు.వీరంతా ఆయా సబ్‌డివిజన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రేమించాలంటూ విద్యార్థినులు, యువతుల వెంటబడేవారిని, ప్రేమించమని బెదిరించేవారిని, ఫోన్ చేసి వేధించేవారిపై షీటీమ్స్ నిఘా పెట్టాయి. పోకిరీల వేధింపులను కొంతమంది తల్లిదండ్రులకు, స్నేహితులకు చెబుతుండగా, పలువురు గోప్యత పాటించి లోలోపల కుమిలిపోతున్నారు. సూర్యాపేటలోని 60ఫీట్ల రోడ్డు ప్రాంతంలో, విద్యా సంస్థల ప్రాంతాల్లో పోకిరీలు ఎక్కువగా సంచరిస్తున్నారు. విద్యార్థినులు కళాశాలలకు వచ్చి వెళ్లే సమయాల్లో వెంటబడుతున్నారు. కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజక వర్గాల్లో కూడా విద్యార్థినిలను వేధించే ఘటనలు ఎక్కువయ్యాయి. ఉన్నత విద్య కోసం గ్రామీణ విద్యార్థినులు ఎక్కుగా పట్టణాలకు వస్తున్నందున ఆయా గ్రామాలకు చెందిన యువకులు, ఆటోలు నడిపే యువకులు వేధించేవారిలో ఎక్కువగా ఉంటున్నారు. విద్యార్థినులు వసతి గృహాల సముదాయల వద్ద ఎలాంటి రక్షణలేకపోవడం కొంతమంది పోకిరీలకు ఇష్టారాజ్యంగా మారింది.


జయ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం అధికారులు (ఫైల్)

అవగాహన సదస్సులతో చైతన్యం

జిల్లాలో ఏడాది కాలంలో విద్యాసంసలో షీటీమ్స్ 138అవగాహన సదస్సులు నిర్వహించాయి.19వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు, యువతులను వేధిస్తున్న 160మంది ఆకతాయిలను షీటీమ్స్ సభ్యులు పట్టుకుని కౌన్సెలింగ్ చేశారు. అయినా మార్పురానందున 17మందిపై కేసులు నమోదు చేశారు. నెలరోజుల వ్యవధిలో నాలుగు కేసులు నమోదు చేశారు.

వేధింపులకు పాల్పడితే చట్టరీత్య చర్యలు చేపడుతాం



ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాలకు మేరకు జిల్లాలో షీటీమ్స్ పనిచేస్తు న్నాయి. విద్యార్థినులు, యువతులను వేధించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. ఇబ్బందులు ఎదురైతే విద్యార్థినులు, యువతులు వెంటనే సమాచారం ఇవ్వాలి. ఆకతాయిల వేధింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం, తల్లిదండ్రులు కూడా వారి పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. ఏ చిన్న సమస్య ఉన్నా సెల్ నెం.8712686056ను సంప్రదించాలి.

- ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ, షీటీం, సూర్యాపేట

'నిధులు విడుదల చేయాలి'

నేరేడుచర్ల, మార్చి 25: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ వసతి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, మరుగుదొడ్లు, స్నానపు గదుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే నిధులు విడుదల చేసి. మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన కోరారు.

పెట్రోలియం డీలర్ల మౌన ప్రదర్శన

కోదాడ, మార్చి 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలో పెట్రోలియం డీలర్లు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్ మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలు ఏడేళ్ల నుంచి తమ కమీషన్లు పెంచలేదన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నప్పటికీ కమీషన్లు పెంచనందున నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వాలు స్పందించి, తమ కమీషన్లు పెంచటంతో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గరిణె శ్రీధర్, లోకేష్, నాగరాజు, శేషు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, మార్చి 25: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో సోమవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మ నాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం


పూజల్లో పాల్గొన్న భక్తులు

చివ్వెంల, మార్చి 25: మండల కేంద్రంలోని ఖాసింపేట గ్రామంలో దత్తాత్రేయ మందిరంలో సోమవారం అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా బండ్రవెల్లి దత్తాత్రేయ పీఠం కృష్ణానంద గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనఘాష్టమి లక్ష్మీదేవి, పార్వతి, సరస్వతి అంశ అన్నారు. దత్తాత్రేయుడిని పూజిస్తే ఆరుగురు దేవతలను పూజించినట్లేనని అన్నారు. దేవలోకంలో 12 వైకుంఠాలు ఉంటాయని, వాటిలో దివ్య వైకుంఠం ఎంతో మహిమకలిగిందని తెలిపారు. ఇప్పటివరకు దేవాలయంలో 12వ్రతాలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు వెంకటరాములు, లింగయ్య, పాపాయ్య, సహదేవ్, వెంకటేశ్వర్లు, సురేష్, లింగమ్మ, వెంకటమ్మ, రాజ్యం, శివ పాల్గొన్నారు.

అయ్యప్ప జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

నేరేడుచర్ల, కోదాడ, గరిడేపల్లి, మార్చి 25: అయ్యప్పస్వామి జయంతిని సోమవారం నేరేడుచర్ల, కోదాడ, గరిడేపల్లి మండలాల్లో నిర్వహించారు. నేరేడుచర్లలోని రామాలయంలో ఉన్న అయ్యప్ప స్వామి పీఠం వద్ద గురుస్వాములు ఐల శ్రీను, చిట్యాల శ్రీను, అలిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజల్లో అయ్యప్ప భక్తులు, నాగరాజు, మోహన్‌రెడ్డి, సురేష్, సత్యనారాయణ, రాజు, దుర్గారావు, సురేందర్, అమర్‌నాథ్, పాల్గొన్నారు.

● కోదాడలోని అయ్యప్ప దేవాలయంలో గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ యర్నేని వెంకటరత్నంబాబు, దేవాలయ కార్యదర్శి చల్లా రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి కృష్ణయ్య, రావెళ్ల కృష్ణారావు, శివప్రసాద్, మోహన్, రామయ్యఅర్చకులు వివేకయ్య, దివాకర్ పాల్గొన్నారు.

● అయ్యప్పస్వామి జయంతి సందర్భంగా గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ చరమంద రాజు ఎస్ఐ ఈటె సైదులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండు రామాంజిగౌడ్, ఎంపీటీసీ బాల్దూరి సందీప్, కడప దేవదానం, భక్తులు పాల్గొన్నారు.


నేరేడుచర్లలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.మదన్‌గుప్తా

గరిడేపల్లి, మార్చి 25: సేంద్రియ వ్యవసాయంపై రైతులు, యువత దృష్టి సారించాలని తెలంగాణ గో సేవా మెంబర్ పి.మధన్‌గుప్తా అన్నారు. సేంద్రియ వ్యవసాయంపై సోమవారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో రైతులు, యవతకు ఐదో రోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయం ద్వారా భూఆరోగ్యంతోపాటు, మానవ ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చన్నారు. వ్యవసాయ విధానాల ద్వారా రైతులు ఆదాయ మార్గాలను రెట్టింపు చేసుకోవాలని ఆయన సూచించారు. రసాయన ఎరువుల వాడకం ద్వారా భూమి కలుషితం అవుతుందని, సేంద్రియ వ్యవసాయం ద్వారా భూఆరోగ్యం పెరుగుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంలో వాడే వివిధ రకాల ద్రావణాలు, కషాయం తయారీ విధానాలను వివరించారు. ఆవు పేడ, మూత్రంతో వివిధ రకాల ఉప ఉత్పత్తుల ద్వారా సబ్బులు, షాంపులు, అగర్‌బత్తీల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఏ.కిరణ్, రైతులు, యువకులు పాల్గొన్నారు.

ఎంతోమందిని కళాకారులుగా తీర్చిదిద్దిన కేఎల్ఎన్

మునగాల రూరల్, మార్చి 25: నిరక్షరాస్యులైన ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత కోదాటి లక్ష్మీనరసింహారావుకు ఉందని గవిని అంజనేయులు అన్నారు. రేపాల గ్రామం వెలుగు నాట్యమండలి స్థాపకుడు, రచయిత, నటుడు కోదాటి లక్ష్మీనరసింహారావు(కేఎల్ఎన్) శత జయంతిని సోమవారం మండలంలోని రేపాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు అంజనేయులు మాట్లాడుతూ కేఎల్ఎన్ తెలంగాణ తొలి మాండలిక రచయిత అని, ఆయన నాటకాలపై పరిశోధన చేసిన కె.రాజేశ్వరి పీహెచ్‌డీ పట్టా పొందారన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరై పందిరి పుల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామ వెలుగు నాట్యమండలి కళాకారులు రాష్ట్రంలో ఎన్నో నాటక పోటీల్లో పాల్గొని ఉత్తమ కళాకారులుగా ప్రశంసలు అందుకున్నారన్నారు. . మారుమూల గ్రామమైన రేపాలకు గుర్తింపు తెచ్చిన కళాకారులను స్మరించుకోవడం అదృష్టమని అన్నారు. కళాకారుల వారసులను దేవస్థాన మాజీ చైర్మన్ గడ్డం గోవర్ధన్‌రెడ్డి సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సారిక చినరామయ్య, నీలకంఠం రమేష్, బెజవాడ సీతారాములు, మాచర్ల రామయ్య, అక్కిరాజు గోపాలకృష్ణరావు, కందిబండ మోహన్‌రావు, కందిబండ ఉపేందర్ పాల్గొన్నారు.


కళాకారుల వారసులకు జ్ఞాపికలను అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో భద్రత కట్టుదిట్టం

మేళ్లచెర్వు, మార్చి 25: అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో భద్రతను కట్టుదిట్టం చేశామని కోదాడ రూరల్ సీఐ రంజితారెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రామాపురం గ్రామ శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ పరమేష్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

పెన్‌పహాడ్, మార్చి 25: ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాజుల మల్కాపురం, చీదేళ్ల గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు ఆశపడకుండా ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీందర్ పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం బలోపేతానికి కృషి చేయాలి

మఠంపల్లి, మార్చి 25: మఠంపల్లి మత్స్య సహకార సంఘం బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన తవడబోయిన నాగేశ్వరావు, పాలకవర్గ సభ్యులను మంత్రి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆదూదరి కిషోర్‌రెడ్డి, మల్లికంటి బుచ్చయ్య, చిన్నపరెడ్డి, ఎంపీటీసీ ప్రభుదాసు, వెంకటయ్య, కె.వెంకటేశ్వర్లువీరాబాబు,శౌరి, ప్రసాద్, రాములు, మహేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు

కోదాడ రూరల్, మార్చి 25: మండలంలోని తొగర్రాయి గ్రామంలో ప్రాచీన రుక్మిణీ సత్యభామ గోదాదేవి సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం దేవతాహ్వానం, మండప పూజలు, భేరీ పూజ, హోమం, ధ్వజారోహణ పూజలు నిర్వహించి సంతానం లేని దంపతులకు గరుడ ముద్దలు అందించారు. గరుడ ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. స్వామి అనుగ్రహంతో పలువురికి సంతానం కలిగిందని, అందుకే స్వామికి సంతాన వేణుగోపాలస్వామి అని పేరు వచ్చిందని దేవాలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో యాదా వెంకటేశ్వర్లు, యాదా రమేష్, శ్రీనివాసరావు, నరసింహారావు, సురేష్, నందుల శాస్త్రి, హనుమంతరావు, సింగరయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

'కరువు జిల్లాగా ప్రకటించాలి'

మఠంపల్లి, మార్చి 25: సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ కాలువ ద్వారా నీటిని విడుదల చేయనదున కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రైతులు ఆయకట్టు కింద సాగు చేసి వరిపైర్లు ఎండిపోయాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు మండలాలను ప్రకటించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మాలోతు బాలునాయక్, జానయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, పి.రాము, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.